www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 5 డిసెంబర్ 2025
5
పశ్చిమ గోదావరి



పంచాయతీ రాజ్ వ్యవస్థలో మార్పులు కూటమి ఘనతే
డిఎల్‌డిఒ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎంఎల్ఎ బొలిశెట్టి


డిఎల్‌డిఒ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

తాడేపల్లిగూడెం: పంచాయతీ రాజ్ వ్యవస్థలో పెనుమార్పులు తీసుకొచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. గురువారం పెద్దతాడేపల్లిలో నూతనంగా నిర్మించిన డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కార్యాలయాన్ని ఎంఎల్ఎ ప్రారంభించి మాట్లాడారు. కలెక్టరేట్ స్థాయిలో ప్రజల వద్దకు పాలన తెచ్చేందుకు నేడు పంచాయతీరాజ్ వ్యవస్థలో నెలకొల్పిన డివిజనల్ డెవలప్ మెంట్ అధికారి కార్యాలయాలు పల్లెకు పట్టుకొమ్మలుగా నిలుస్తాయన్నారు. పెద్దతాడేపల్లి సర్పంచి పి.అన్నవరం, కార్యదర్శి రవిచంద్ర, టిడిపి రూరల్ అధ్యక్షులు పరిమి రవికుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రూప్‌చంద్ ధర ఢమాల్..!


మార్కెట్‌కు సిద్ధం చేస్తున్న రూప్‌చంద్ చేపలు

మేత, లీజు సొమ్ము సైతం రాని దుస్థితి - తీవ్ర ఆందోళనలో చేపల సాగుదారులు

ప్రజాశక్తి - కాళ్ల

ఉప్పుటేరు, కొల్లేరు తీర ప్రాంతంలో చేపల సాగులో ముఖ్యమైన రూప్‌చంద్ ధర అత్యంత కనిష్టస్థాయికి పడిపోయింది. గత దశాబ్ద కాలంలో ఎన్నడూ ధర ఇంత దిగజారలేదని, ఈ ధర వల్ల రూప్‌చంద్ సాగు చేసే రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్నారు.

జిల్లాలో చేపల రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. పెరిగిన ఫీడ్, సీడ్ ధరలకు తోడు నకిలీ సీడ్‌తో చేపల సాగు కుదేలవుతోంది. ఇదే సమయంలో వ్యాపారులు సిండికేట్‌గా మారి ధర తగ్గించడంతో కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదు. ఈ పరిస్థితుల్లో చేపల సాగుకు రైతులు వెనుకంజ వేస్తున్నారు.

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాల్లో చేపల సాగు ఉంది. ప్రస్తుతం దిగుబడులు తగ్గుముఖం పట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వేలాది ఎకరాల్లోని చేపల చెరువుల్లో కేజీన్నరకుపైగా బరువు పెరిగిన చేపలను పట్టుబడులు చేస్తున్నారు. ఆరు సంవత్సరాల నుంచి తెల్ల చేపలు సాగు చేస్తున్న రైతులు ఫీడ్ ధరలు అమాంతం పెరగడం, వ్యాపారులు కుమ్మక్కై ధరలు తగ్గించడంతో నష్టాలు చవి చూస్తున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని రైతులు చెబుతున్నారు.

కిలో చేపల ధర రూ.80 నుంచి రూ.90కు తగ్గిపోవడంతో కనీసం పెట్టుబడులు రావడం లేదని, కనీసం కిలో ధర రూ.125కు విక్రయిస్తేనే గిట్టుబాటు అవుతుందని రైతులు చెబుతున్నారు. కొత్తగా కొంతమంది రెండేళ్ల నుంచి రూపచంద్ చేపలు సాగు చేస్తున్నారు. ఏడాదిపాటు లాభాలు ఆర్జించారు. రెండోయేట నుంచి కిలో రూ.100 నుంచి రూ.80కి ధర తగ్గిపోవడంతో నష్టాలు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు.

ఎకరానికి రూ.40 వేలు నష్టం

రూప్‌చంద్ సాగు చేపట్టిన మొదట్లో కిలో వంద రూపాయలకు వ్యాపారులు కొనుగోలు చేయడంతో రైతులకు గిట్టుబాటయ్యేది. ప్రస్తుతం కిలో రూ.80కి తగ్గించడంతో ఎకరాకు రూ.40 వేల నష్టం వస్తున్నట్లు చెబుతున్నారు.

అధికారుల పర్యవేక్షణేదీ..!

జిల్లాలో వందల సంఖ్యలో ఫీడ్, కెమికల్స్ దుకాణాలు ఉన్నాయి. వీటిపై మత్స్యశాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడి నకిలీ ఫీడ్, కెమికల్స్ రాజ్యమేలుతున్నాయని చేపల రైతులు ఆరోపిస్తున్నారు. ఫీడ్‌ను చేపలకు వేయడం వల్ల పెరుగుదల లేదని, దీంతో బరువు రాక నష్టాలు వస్తున్నాయని చెబుతున్నారు.

ధర పతనం

ఈ సంవత్సరం జూన్ చివర నుంచి రూప్‌చంద్ ధర పతనం కావడం ప్రారంభమైంది. రైతు వద్ద రూ.114, రూ.115 పలికిన చేప ధర పతనమవుతూ ప్రస్తుతం కనిష్ట స్థాయి రూ.80కు దిగజారింది. ఒక లారీకి పది టన్నుల సరుకు పడితే రైతుకు సుమారు రూ.1.50 లక్షలు నష్టం వస్తోంది. ఇలాగైతే సాగు ఎలా కొనసాగించగలమని రైతులు లబోదిబోమంటున్నారు. మార్కెట్ విశ్లేషకుల అంచనా ప్రకారం ఈ ధర ఇంకా పతనమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇదే జరిగితే ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా ఆయకట్టు ప్రాంతంలో ఇక మీదట చేపల సాగుకు ప్రయత్నించలేని దుస్థితి దాపురిస్తుందని వాపోతున్నారు.

అరువు లేదంటున్న ఫీడ్ కంపెనీలు, డీలర్లు

రూప్‌చంద్ చేప ధర కనిష్ట స్థాయికి చేరడంతో చేపలు పట్టడానికి రైతుల ముందుకు రావడం లేదు. గత సంవత్సర కాలం నుంచి చేపల చెరువులకు మేతల పెట్టుబడులు పెడుతున్న ఫీడ్ కంపెనీలు, డీలర్లు ఇక పెట్టుబడులు పెట్టలేక ఇబ్బందులు పడుతూ వెనుకంజ వేస్తున్నారు. ఫీడ్ కంపెనీలు, డీలర్లు మేతకు అరువు ఇవ్వకుండా సొమ్ము చెల్లిస్తేనే మేత పంపుతామని చెబుతున్నారు. ఇప్పటికే తాము చాలా సొమ్ము అరువుగా ఇచ్చామని, ఇక ఇవ్వలేమని, సొమ్ము చెల్లిస్తేనే మేత పంపగలమని తేల్చి చెబుతున్నారు. రెండు రోజులకోసారి మేత చల్లాల్సి ఉందని, ఈ విధంగానైతే చేప పెరుగుదల నిలిచి పోతుందని రైతులు ఆందోళన చెందుతుందన్నారు.

ధర పతనానికి కారణాలు

కార్తీక మాసం, షష్ఠి పండుగల ప్రభావమే రూప్‌చంద్ ధర తగ్గడానికి కారణమని ట్రేడర్స్ చెబుతున్నారు. మరో రెండు, మూడు నెలలు ఇదే పరిస్థితి ఉండవచ్చని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మార్కెట్‌కు వస్తున్న సరుకు ఎక్కువగా ఉండడం వల్ల ధర తగ్గుతుంది.

ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి..

మంతెన ఆంజనేయరాజు, ఆక్వా రైతు, ఏలూరుపాడు



కొంతకాలంగా రూప్‌చంద్ ధర పతనం రైతులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా కేజీ రూప్‌చంద్ ధర రూ.80 నుంచి రూ.82 మధ్య కొనుగోలు చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఒక కేజీ రూప్‌చంద్ చేప తయారీకి సుమారు రూ.90 నుంచి రూ.95 వరకు ఖర్చవుతుండటంతో రైతు నష్టానికే పట్టుబడులు పట్టాల్సి వస్తోంది. ప్రభుత్వం ట్రేడర్స్‌తో చర్చలు జరిపి గిట్టుబాటు ధరకు చర్యలు తీసుకోవాలి.

ఫీడ్ ధరలు తగ్గించాలి..

కంతేటి శ్రీనివాసరాజు, ఆక్వా రైతు, ప్రాతళ్లమెరక



ఇటీవల కాలంలో చేప ధర బాగా పతనం కావడంతో గిట్టుబాటు కావడం లేదు. ఈ ధరకు కనీసం మేత ఖర్చులు, లీజు సొమ్ము రావడం లేదు. కరోనా సమయంలో కూడా ఇంత తక్కువ ధర లేదు. డీలర్లు మేత ఇవ్వనంటున్నారు. ప్రభుత్వ పెద్దలు ఫీడ్ కంపెనీలతో చర్చించి ఫీడ్ ధరలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలి. ఒడిశాలో చెరువుల తవ్వకానికి అక్కడి ప్రభుత్వం రైతుకు సబ్సిడీలు అందించి పోత్సహిస్తోంది. ప్రభుత్వం ఆక్వా రంగాన్ని ఆదుకోవాలి.

జల జీవన్ మిషన్ ప్రాజెక్టు పనులు.. వేగవంతం చేయాలి
తాగునీటి ప్రాజెక్టు ఏర్పాటు పనులపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి - భీమవరం


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

జిల్లాలో జల జీవన్ మిషన్ ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం జల జీవన్ మిషన్ ఫేజ్ వన్ కింద కోస్తా ప్రాంతంలో తాగునీటి సరఫరా ప్రాజెక్ట్ ఏర్పాటు పనులపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశాన్ని ఏర్పాటు చేసి సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు స్థితిగతులు, ప్రాజెక్టు నిర్మాణ గుత్తేదారుడు, ప్రతినిధి మెయిల్ కంపెనీ డిజిఎం పి.వాసు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జల జీవన్ మిషన్ మొదటి విడత కింద జిల్లాలో స్వచ్ఛమైన తాగునీరందించేందుకు రూ.1400 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్టు 16 మండలాల పరిధిలో 862 గ్రామాలను కలుపుతూ 13.25 లక్షల కుటుంబాలకు తాగునీరు అందించేలా రూపొందించడం జరిగిందన్నారు. దీని నిర్మాణం కోసం 2,662 కిలో మీటర్ల మేర పైపులైన్లు వేయాల్సి ఉందని తెలిపారు. ఎన్‌హెచ్-265, 216-ఎ, 216, ఆర్అండ్‌బి, పంచాయతీ రోడ్లు, రైల్వే ట్రాక్ క్రాసింగ్స్, గెయిల్ పైప్ లైన్స్, ఇరిగేషన్ చానల్స్ మీదుగా పైపులైన్ల నిర్మాణం చేయాల్సి ఉందని తెలిపారు. ఆయా శాఖలు పైపు లైన్లు వేసేందుకు అవసరమైన క్లియరెన్స్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఇవ్వాలని సూచించారు. దీనికి సంబంధించి 69 ఒహెచ్ఎస్ఆర్‌లు నిర్మాణం చేపట్టాల్సి ఉండగా ఇప్పటివరకు 10 నిర్మాణాలను పూర్తి చేయడం జరిగిందని, 10 నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ కె.శ్రీనివాసరావు, ఆర్అండ్‌బి డిఇ జి.వరలక్ష్మి, జిల్లా జల వనరుల శాఖ అధికారి సత్యనారాయణ, రైల్వే భీమవరం డివిజనల్ ఇంజినీర్ ప్రకాష్, మెయిల్ డిజిఎం పి.వాసు, గెయిల్ పాల్గొన్నారు.

ఆహారం నాణ్యతతో అందించాలి
అన్నా క్యాంటీన్‌లో జెసి తనిఖీ

ప్రజాశక్తి - నరసాపురం


భోజనం రుచి చూస్తున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

అన్నా క్యాంటీన్‌లో ఆహారాన్ని నాణ్యతతో, పరిశుభ్రమైన వాతావరణంలో అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక స్టీమర్ రోడ్డులోని అన్నా క్యాంటీన్‌ను జెసి రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జెసి అన్నా క్యాంటీన్ నిర్వహణ, పరిశుభ్రత, ఆహార నాణ్యత, వసతులను పరిశీలించారు. భోజనం చేస్తున్న వారితో మాట్లాడారు. స్వయంగా లబ్ధిదారులకు భోజనం వడ్డించి స్వయంగా ఆయన భోజనం రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదల కోసం 5 రూపాయలకే నాణ్యతతో రుచికరమైన భోజనం అందిస్తోందన్నారు. భోజనం వేడివేడిగా క్వాలిటీగా ఉంటోందని, సర్వీస్ కూడా బాగుందని ఇక్కడ భోజనం చేస్తున్నవారు తెలిపారని చెప్పారు. అన్నా క్యాంటీన్ నిర్వహణ సమయంలో మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. క్యాంటీన్లో లబ్ధిదారులకు వసతులతోపాటు, పరిశుభ్రతను పాటించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అన్నా క్యాంటీన్ నిర్వహణ సమయంలో నిర్వహణ, పరిశుభ్రత, నీటి సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షం వస్తే భోజనం చేసే వారు తడుస్తున్నారని నిర్వాహకులు జెసికి తెలపగా మున్సిపాలిటీ ద్వారా ఒక షెడ్డును ఏర్పాటు చేయాలని ఆయన మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఆర్‌డిఒ దాసిరాజు, మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య, తహశీల్దార్ అయితం సత్యనారాయణ, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పెంచలయ్య హత్యకు కారకులను శిక్షించాలి
సిపిఎం, ఐద్వా ఆధ్వర్యాన నిరసనలు


పెంటపాడులో నిరసన తెలుపుతున్న నేతలు

ప్రజాశక్తి - పెంటపాడు

నెల్లూరు జిల్లాలో గంజాయి ముఠాను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. సిపిఎం మండల కన్వీనర్ సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి, బొంకూర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా నాట్యమండలి కళాకారుడు, సిపిఎం నాయకుడు పెంచలయ్యను కుటుంబ సభ్యుల ముందే మారణాయుధాలతో నరికి చంపడం హేయమైన చర్య అని తెలిపారు. చంద్రబాబు నాయుడు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గంజాయి ముఠాను రాష్ట్రంలో సమూలంగా నిర్మూలిస్తామని చెప్పారని, అధికారంలోకి వచ్చి 15 నెలలైనా గంజాయి వ్యాపారం యథేచ్ఛగా సాగుతోందని తెలిపారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పి.పెంచలయ్య ఎన్నిసార్లు ప్రభుత్వానికి విన్నవించినా, అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని తెలిపారు. అయితే కళారూపాలు, నాటికలు, పాటల ద్వారా గంజాయి ముఠా గుట్టు రట్టు చేయడానికి, ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి చేస్తున్న కృషిని కామ్రేడ్ ముఠా ఒకరికి తన రౌడీ మూకలతో పెంచలయ్యను నరికి చంపించిన తెలిపారు. పెంచలయ్య చనిపోయినా కనీసం పోలీస్ స్టేషన్లో కేసు కూడా నమోదు కాలేదని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ముఖ్యమంత్రిని కలవడానికి అపాయింట్మెంట్ కూడా అడిగితేనా గత్యంతరం లేని పరిస్థితిలో జిల్లా బంద్‌కు సిపిఎం పిలుపు ఇచ్చిందని తెలిపారు. నెల్లూరు జిల్లాలోని రాజకీయ పార్టీలు ప్రజలు పెద్ద ఎత్తున నిరసన సభల్లో పాల్గొన్నారు. ఈ ప్రజాస్వామ్య చూసి ప్రభుత్వ అధికారులు కదలిక వచ్చింది, కామ్రేడ్ ముఠాను పూర్తిగా అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వారు తెలిపారు. గంజాయిని నిర్మూలించాలని, పెంచలయ్య కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని, ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గంటా కోటేశ్వరరావు, బర్ల బాలాజీ, దత్తు రాము, బొంకూరు మణికంఠ, మాదా శ్రీను, అప్పల ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తణుకు : నెల్లూరులో గంజాయి మాఫియాకు వ్యతిరేకంగా పోరాడిన పెంచలయ్యను హత్య చేసిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఐద్వా తణుకు అధ్యక్ష కార్యదర్శులు చిక్కాల అన్నపూర్ణ, కొత్తుర్తి నాగరత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో పట్టణంలోని 34వ వార్డులో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి మాఫియా ఆగడాలను అడ్డుకుంటున్నారనే కక్షతో పెంచలయ్యను హత్య చేశారన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వల్ల చిన్న పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని తెలిపారు. మత్తు పదార్థాలు అరికడితే ఇలాంటి అఘాయిత్యాలు తగ్గుతాయన్నారు. పెంచలయ్యను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని, వారి కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాగితం వరలక్ష్మి, సిహెచ్.దుర్గ, జె.ఉమామహేశ్వరి, డి.సీతామహాలక్ష్మి, కె.కృష్ణవేణి పాల్గొన్నారు.


తణుకులో నిరసన తెలుపుతున్న ఐద్వా నేతలు

టిడిపి ప్రచార కేంద్రాలుగా మెగా పిటిఎంను మార్చొద్దు
ఎస్ఎఫ్ఐ

భీమవరం : ఈ నెల 5న జిల్లా వ్యాప్తంగా నిర్వహించబోయే మెగా టీచర్స్, పేరెంట్స్ మీటింగ్ టిడిపి ప్రచార కేంద్రాలుగా మార్చొద్దని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.గణేష్, డి.ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు వారు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు టిడిపి కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని ఆదేశించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. టీచర్స్, పేరెంట్స్ సమావేశాలు విద్యార్థుల సమస్యలు, విద్యారంగ అభివృద్ధి గురించి చర్చించే వేదికగా ఉండాలి గానీ రాజకీయ వేదికగా ఉపయోగించకూడదని తెలిపారు. సిఎం పార్టీ రాజకీయ వేదికగా ఉపయోగించుకోవడాన్ని సిగ్గుచేటుగా విమర్శించారు. నారా లోకేష్ ఒకవైపు విద్యాసంస్థల్లో రాజకీయ ప్రసంగాలొద్దు, కార్యకలాపాలు వద్దు, జెండాలు వద్దు అని చెబుతూనే వారి పార్టీ కార్యకర్తలతో టీచర్స్ పేరెంట్స్ సమావేశాలు నిర్వహించాలనుకోవడం దుర్మార్గమని విమర్శించారు. ప్రజాతంత్రయుతంగా విద్యార్థి సంఘాలు, విద్యార్థి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో చర్చించి జిల్లా విద్యారంగం అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

సోషలిజంతోనే సమానత్వం
నాగేశ్వరరావు సంస్మరణ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - యలమంచిలి

ప్రస్తుత సమాజంలో సామాజిక, ఆర్థిక అసమానతలు, కులాల మధ్య అంతరాలు పోయి సమానత్వం రావాలంటే ఒక్క సోషలిజం తోనే సాధ్యమని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. గురువారం మండలంలోని చించినాడ సమరశీల పోరాట నాయకుడు కేతా నాగేశ్వరరావు సంస్మరణ సభ పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు అధ్యక్షతన జరిగింది. ముందుగా నాగేశ్వరరావు చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో గోపాలన్ మాట్లాడుతూ 1977- 1980 మధ్యకాలంలో చించినాడ మహా పోరాటంలో నాగేశ్వరరావు అనేక ఆటుపోట్లు, నిర్బంధాలు, 26 కేసులు, వాటిలో రెండు అక్రమ హత్య కేసులు, ఆఖరికి సుమారు 6 నెలలు జైలు జీవితాన్ని కూడా అనుభవించి తుది శ్వాస విడిచే వరకూ సుమారు 50 సంవత్సరాల పాటు ఎర్రజెండాను వదలకుండా ఉన్నారంటే ఆయన ఎంత నిబద్ధతతో ఉన్నారో అర్థమవుతుందన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ఆనాడు చించినాడలో కూడా సమానత్వం ఆర్థిక సమానత్వం కోసం, సుదీర్ఘకాలం పాటు జరిగిన పోరాటాల ఫలితంగానే సుమారు 70 సంవత్సరాల పాటు ఎర్రజెండా పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో జీవించారని గుర్తుచేశారు. ఇప్పటి తరం కూడా అటువంటి వారసత్వాన్ని కొనసాగించాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా సోషలిజం వైపు యువత మొగ్గు చూపుతున్నారని, దీనికి ఉదాహరణే ఈ మధ్య అమెరికాలోని వాషింగ్టన్‌లో మేయర్ పదవిని ఎర్రజెండా కైవసం చేసుకోవడం అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 800 కోట్ల మంది జనాభా ఉంటే వారిలో సుమారు 180 కోట్ల మంది ప్రజలకు ఎర్రజెండా ప్రతినిధిగా ఉందన్నారు. ఒకపక్క దేశ సంపద పెరుగుతున్నా.. పేదరికం మరింత పెరగడం ఆందోళన కలిగించే విషయమన్నారు. ఇటువంటి విధానాలు మారాలంటే కచ్చితంగా భారతదేశంలో కూడా సోషలిజంతోనే సాధ్యమని ప్రజలకు వివరించి చైతన్య పర్చాలని సూచించారు. సభలో కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి, నాగేశ్వరరావు సోదరుడు, సిపిఎం సీనియర్ నేత మాజీ పంచాయతీ, సొసైటీ ప్రెసిడెంట్ కేతా సూర్యారావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు, సిపిఎం సీనియర్ నేత పీతల రామచంద్రరావు, సిపిఎం నర్సాపురం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి మాట్లాడారు. సిపిఎం, ఐద్వా మండల కమిటీ, సిపిఎం గ్రామస్థాయి నాయకులు, నాగేశ్వరరావు బంధువులు పాల్గొన్నారు.

చిన్నారులను శ్రద్ధగా చూడాలి : కలెక్టర్

పాలకోడేరు : శిశు గృహ సంరక్షణలో ఉన్న పిల్లలను ప్రత్యేక శ్రద్ధతో సాకాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. విస్సాకోడేరులోని శిశు గృహ సంరక్షణ కేంద్రాన్ని కలెక్టర్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా శిశు గృహ సంరక్షణలో ఉన్న పిల్లలను ఎత్తుకుని ముద్దాడారు. ఎంతమంది పిల్లలు ఉన్నారు, దత్తత ప్రక్రియ ఎంతవరకూ వచ్చింది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. శిశు గృహ సంరక్షణలో ఉన్న పిల్లలను శ్రద్ధగా చూడాలన్నారు. ఆరు సంవత్సరాల్లోపు పిల్లలను శిశు గృహ సంరక్షణలో ఉంచడం జరుగుతుందని, ప్రస్తుతం ఇద్దరు చిన్నారులు శిశు గృహంలో ఉన్నారని తెలిపారు. ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఐసిడిఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేష్, జెఎస్‌పి నాయకులు జుత్తిగ నాగరాజు, శిశు గృహ నిర్వాహకులు ఉన్నారు.

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి
తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన


ప్రజాశక్తి - ఉండి

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని విఆర్ఎల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.ఆంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఎలు నిరసన తెలిపి డిప్యూటీ తహశీల్దార్ కూనపరాజు సూర్యనారాయణ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ అటెండర్, నైట్ వాచ్‌మెన్ పోస్టుల భర్తీ కోసం జరిగిన ప్రక్రియలో విఆర్ఎలకు అన్యాయం జరిగిందన్నారు. సీనియార్టీ ప్రకారం లిస్టులు తయారుచేసిన ప్రభుత్వం డ్రైవింగ్, కంప్యూటర్ వచ్చా అంటూ ప్రశ్నించి అవి రావు కాబట్టి ప్రమోషన్లు లేవనే పేరుతో వట్టి చేతులు చూపించడం బాధాకరమని అన్నారు. ఇప్పటివరకు తాత పోస్టుల్లో తండ్రి పోస్టుల్లో పనిచేస్తూ నామినీలుగా ఉన్న వారిని విఆర్ఎలుగా గుర్తించాలని అనేక సంవత్సరాలుగా కోరుతున్నారన్నారు. ఐదుగురు ఉండాల్సిన గ్రామంలో వివిధ కారణాలతో ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. విఆర్ఎల సంఘం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం భీమవరంలోని కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్ఎలు పాల్గొన్నారు.


డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

రవాణా రంగ కార్మికులపై ఆర్‌టిఎ అధికారులు వేధింపులు ఆపాలి
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు

ప్రజాశక్తి - భీమవరం


కార్మికులను సిఐటియులోకి ఆహ్వానిస్తున్న వాసుదేవరావు

రవాణా రంగంలో పనిచేస్తున్న ట్రక్ ఆటో, బొలెరో వ్యాన్ల డ్రైవర్ కార్మికులపై అధిక లోడుల పేరుతో ఆర్‌టిఎ అధికారుల వేధింపులు ఆపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. స్థానిక మార్కెట్ యాడ్‌లో భీమవరం ప్రాంతంలోని ట్రక్కు అండ్ బొలెరో వ్యాన్ డ్రైవర్లు 150 మంది సిఐటియు_యూనియన్‌లో గురువారం చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు నాయకులు కె.రాజు అధ్యక్షత వహించగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వాసుదేవరావు మాట్లాడారు. ఉన్నత చదువులు చదివినప్పటికీ ఉద్యోగాలు లేక ఫైనాన్స్‌లో లక్షల్లో అప్పులు చేసి ఆటోలు, వ్యాన్లు కొనుక్కొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. చిన్న చిన్న వృత్తులు చేసుకునే రవాణా కార్మికులను ఆర్‌టిఎ అధికారులు వేధింపులకు గురి చేయడం దారుణమన్నారు. పెద్ద పెద్ద వాహనాలు 30 టన్నులతో రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకోకుండా చిన్న డ్రైవర్లపై వేలకు వేలు ఫెనాల్టీలు విధించడం అన్యాయమని విమర్శించారు. అధికారులు అధిక ఫెనాల్టీతో కార్మికులకు తీవ్ర మానసిక ఆవేదనకు గురిచేస్తున్నారన్నారు. రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా రూ.15 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిఎ అధికారులు వేధింపులు ఆపకపోతే ఆర్‌టిఒ కార్యాలయం ముట్టడికి వెనకాడబోమని హెచ్చరించారు. అనంతరం సిఐటియు నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడారు.

భీమవరం ఏరియా ట్రక్కు అండ్ బొలెరో వాహనాల డ్రైవర్ కార్మికుల అసోసియేషన్ సిఐటియు అనుబంధంగా నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. అసోసియేషన్ అధ్యక్షులుగా కె.రాజు, ఉపాధ్యక్షులుగా వి.శ్రీనివాసరాజు, కార్యదర్శిగా బి.శ్రీను, సహాయ కార్యదర్శిగా కె.దుర్గారావు, కోశాధికారిగా పి.రత్నరాజు, కమిటీ సభ్యులుగా వి.శ్రీనివాస్, బి.నాగేశ్వరరావు, సిహెచ్.దిలీప్ కుమార్‌తో పాటు మరో 15 మందితో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మెరుగైన వైద్య సేవలకు కృషి
కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం ఎపి సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయ్ ఆనంద్ ధాన్యం కొనుగోలు, ఎరువుల లభ్యత, సీజనల్ వ్యాధుల నియంత్రణ ఇతర ప్రాధాన్య ఆరోగ్య అంశాలు, పాజిటివ్ పబ్లిక్ పెరస్పన్, డాక్యుమెంట్ అప్లోడ్ ఫర్ ఏజెంట్ స్పేస్ తదితర అంశాలపై వీడియో సమావేశం నిర్వహించారు. భీమవరం కలెక్టరేట్ నుండి కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నారని, తణుకు, నరసాపురం, పాలకొల్లు ఏరియా ఆసుపత్రుల్లో శానిటరీ, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. పూర్వపు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల ప్రాతిపదికన ఎరువుల కేటాయింపు జరుగుతోందన్నారు. డిఆర్ఒ బి.శివన్నారాయణ రెడ్డి, సిపిఒ ఎం.రామనాథరెడ్డి, జిల్లా సర్వే అధికారి జాషువా, జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు డిఎంహెచ్ఒ జి.గీతాబాయి, డిసిహెచ్ఎస్ పి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

7న తణుకులో రోడ్ రన్
పాల్గొనున్న ఇన్‌ఛార్జి మంత్రి రవికుమార్

ప్రజాశక్తి - తణుకు

ప్రధాని మోడీ సంకల్పించిన ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా తణుకు రన్నర్స్ సొసైటీ భాగస్వామ్యంతో ఈనెల 7న తణుకులో మారథాన్ నిర్వహిస్తున్నట్లు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోడ్డు రన్‌కు సంబంధించి టీషర్టు, మెడల్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 7న ఉదయం 5.30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ, జెసి టి.రాహుల్‌కుమార్‌రెడ్డితో పాటు ఈవెంట్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న పాయల్ రాజ్‌పుత్ హాజరవుతున్నట్లు చెప్పారు. 3కె, 5కె, 10కె విభాగాల్లో ఈ రోడ్డు రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకూ ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు 2 వేల మంది రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని తెలిపారు. రోడ్ రన్ నిర్వాహకులు విశ్వతేజ, సాయిదీప్తి, కృష్ణకిరణ్, వినయ్‌పవన్, తణుకు, అత్తిలి ఎఎంసి ఛైర్మన్లు కొండేటి శివ, దాసం ప్రసాద్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ దొమ్మేటి వెంకటసుధాకర్ పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి తోడ్పడాలి : కలెక్టర్



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

భీమవరం : పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతానికి డివిజనల్ అభివృద్ధి అధికారుల కార్యాలయాలు ఎంతగానో తోడ్పడతాయని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. విస్సాకోడేరు గ్రామంలో ఏర్పాటుచేసిన డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. కలెక్టర్ నాగరాణి, ఉండి ఎంఎల్ఎ పచ్చమట్ల ధర్మరాజు, భీమవరం ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఉండి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు, డివిఎల్‌డిఒ వై.దోసి రెడ్డి, సమిత్ర స్టేట్ డైరెక్టర్ ఎ.నిశ్చాంత్ రెడ్డి, డ్వామా ఎపిడి పి.సుజాత పాల్గొన్నారు. తదనంతరం కలెక్టర్, ఎంఎల్ఎ డిడిఒ కార్యాలయ ప్రాంగణంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. డిపిఒ ఎం.రామనాథ్‌రెడ్డి, ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎం.రమ, ఎంపిడిఒ రెడ్డయ్య, ఇఒపిఆర్‌డి రాంప్రసాద్, జిల్లా ఇండస్ట్రియల్ అధికారి ముంగసెపెలాను పాల్గొన్నారు.

చెత్తపై ప్రజలంతా యుద్ధం చేయాలి

డిప్యూటీ ఎంపిడిఒ ఎం.వెంకటేష్

తాడేపల్లిగూడెం: గ్రామాల్లో పరిశుభ్ర వాతావరణం ఏర్పడాలంటే చెత్తపై ప్రజలంతా యుద్ధం చేయాలని డిప్యూటీ ఎంపిడిఒ ఎం.వెంకటేష్ పేర్కొన్నారు. మండలంలోని కుంచుపల్లిలో స్వచ్ఛ భారత్ మిషన్ కాలనీలో గురువారం శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల మధ్య చెత్త ఉంటే ప్రజలు అనారోగ్యం పాలవుతారని, కాబట్టి ఉటువంటి పరిస్థితి ఎక్కడా లేకుండా అంతా పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. గ్రామంలోని చెత్త సంపద తయారీ కేంద్రం పరిశీలించి, అక్కడ చెత్త వేరు చేసే విధానాన్ని పారిశుధ్య కార్మికులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సుంకర శ్రీనివాస్, గంగాధర్, ఎంఆర్‌సిఎం రవి కిరణ్, సెలర్ భవాని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీనివాసరావు కృషి అభినందనీయం

గణపవరం: గ్రామాల్లో పేదప్రజలకి ఉచిత వైద్యశిబిరాల ద్వారా వైద్యం అందిస్తున్న స్థానిక లక్ష్మీ ఫైనాన్స్ అధినేత సూరేపల్లి శ్రీనివాసరావు చేస్తున్న కృషిని పలువురు అభినందించారు. కన్యకాపరమేశ్వరి వర్తక సంఘ భవనంలో తాడేపల్లిగూడెం గౌతమి హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్యశిబిరంలో గైనకాలజీ ఆర్థో పెడిక్, పెడియాట్రిక్ వంటి రోగాలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గణపవరం చుట్టుపక్కల ప్రజలు 150 మంది శిబిరానికి వచ్చారు. శిబిరంలో వైద్యులు యద్దా మాధురి, ఏఆర్ శ్వేత వినోద్ సేవలందించారు. ఈ కార్యక్రమంలో నక్కా రామకృష్ణ, ఎస్.శ్రీనివాస్, కె.సత్యనారాయణ, ప్రకాష్‌రావు, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్ల పనుల పూర్తికి నిధులు

మండల పంచాయతీ రాజ్ ఎఇ సిహెచ్.అశోక్

పెనుమంట్ర : మండలంలో నిధులు లేక అసంపూర్తిగా మిగిలిన పలు గ్రామీణ ఆరోగ్య కేంద్రాల(వెల్‌నెస్ సెంటర్ల)కు చెందిన పనులను మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ చొరవతో పూర్తి చేయడానికి రూ.56.1 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని మండల పంచాయతీ రాజ్ ఎఇ సిహెచ్.అశోక్ గురువారం ఇక్కడ తెలిపారు. ఈమేరకు మామడురుకు రూ.9.60 లక్షలు, మార్టేరు-2 కు రూ.9 లక్షల 30 వేలు, వెలగలేరుకు రూ.8.70 లక్షలు, నత్త రామేశ్వరంకు రూ.3.40 లక్షలు, పొలమూరు-1కు రూ.8.60 లక్షలు, పెనుమంట్ర-2కు రూ.8.40 లక్షలు, సోమరాజు ఇల్లిందలపర్రుకు రూ.8.10 లక్షలు మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఈ నిధులతో భవనాల అసంపూర్తి నిర్మాణం పనులు పూర్తి చేసి, ఆయా భవనాలను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థినులకు సాఫ్ట్ స్కిల్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్

పాలకొల్లు : పాలకొల్లు ఎస్‌సిహెచ్ ప్రభుత్వ డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో మహిళా సాధికారత విభాగం, జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యాన నాంది ఫౌండేషన్ వారి సహకారంతో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.రాజారాజేశ్వరి అధ్యక్షతన కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్-సాఫ్ట్ స్కిల్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ ప్రోగ్రాం డిగ్రీ ఫైనల్ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు ఆంగ్ల భాష మాట్లాడడానికి, ఉపాధి అవకాశాలు నైపుణ్యాలను పొందడం, ఉద్యోగ కల్పన కోసం నైపుణ్య శిక్షణ నాంది ఫౌండేషన్ వారు ఏర్పాటు చేసిన ట్రైనర్ ఈశ్వర్ మీకు అందిస్తారని తెలియజేశారు. ఈశ్వర్ మాట్లాడుతూ ఈ వారం రోజులు మీకు ఇంగ్లీష్ మాట్లాడడం, ఇంటర్వ్యూ స్కిల్స్ యాక్టివిటీ బేస్డ్ స్కిల్ నిర్వహించి ఇందులో శిక్షణ ఇస్తామని చెప్పారు. ఈ ప్రోగ్రాం ఈనెల 10 వరకు కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టర్ సి.హెచ్.కృష్ణ, తెలుగు విభాగాధిపతి బూసి వెంకటస్వామి, ప్లేస్మెంట్ సెల్ ఆఫీసర్ జి.డి.శ్రీనివాస్, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ బి.కెవి.రామలక్ష్మి, జెకెసి మెంటర్ శిరీష, విద్యార్థినులు పాల్గొన్నారు.

అభివృద్ధిని గాలికొదిలేశారు : వైసిపి

ఆచంట: కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి వైసిపి నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడి, అభివృద్ధిని గాలికి వదిలేశారని వైసిపి యువజన విభాగం మండల అధ్యక్షుడు కోట శ్రీ శ్రీ, ప్రధాన కార్యదర్శి కోట గిరిధర్ తెలిపారు. మండలంలో వైసిపి యువజన విభాగం బలోపేతం చేయడంలో భాగంగా వల్లూరులో యూత్ కమిటీని ఏర్పాటు చేశారు. వల్లూరు వైసిపి యూత్ అధ్యక్షులుగా ముద్దాల అజయ్ రాజును, వైసిపి మండల యూత్ కార్యదర్శిగా ఎనుగుపల్లి శ్రీను నియమించినట్లు తెలిపారు. అనంతరం కోట శ్రీ శ్రీ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప కూటమి ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు కొంబొత్తుల దుర్గా ప్రసాద్, మాజీ జెడ్‌పిటిసి ముప్పాల వెంకటేశ్వరావు, పెన్మెత్స సత్యనారాయణ, కంబాల సత్యనారాయణ, నర్సి వీరబాబు సత్యనారాయణ పాల్గొన్నారు.

భీమవరం టిడిపిలో గ్రూపు పోరు అవాస్తవం

భీమవరం టౌన్: భీమవరం నియోజకవర్గం టిడిపిలో వర్గపోరు విభేదాలు ఇబ్బందులు లేవని ఎపి కృష్ణబలిజ పూసల సాధికార కమిటీ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని వీరవాసరం, భీమవరం మండలాలు, భీమవరం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ కొన్ని వార్తాపత్రికలు, యూట్యూబ్, టివి ఛానెల్‌లలో భీమవరం నియోజకవర్గ టిడిపిలో వర్గవిభేదాలు, తీవ్ర ఇబ్బందులు, కుమ్ములాటలు ఉన్నాయని చేస్తున్న అసత్య ప్రచారాన్ని, ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో టిడిపి బలోపేతానికి, పార్టీ అభివృద్ధికి, కూటమి ప్రభుత్వం ఆదేశించిన అన్ని కార్యక్రమాలను, సమావేశాలను విజయవంతం చేస్తున్నామన్నారు. తోట సీతారామలక్ష్మి టిడిపి అధికారంలో లేనప్పుడు పార్టీకి దూరంగా ఉంటారని, పార్టీ అధికారంలోకి వచ్చాక ముందుకు వస్తారని చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని ఖండించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్లు ఉప్పలపాటి వంగలక్ష్మీ, ఎమ్‌డి షబీనా, వీరవాసరం మండల ఉపాధ్యక్షుడు యరకరాజు గోపాలకృష్ణంరాజు, టిడిపి మండల మాజీ ప్రధాన కార్యదర్శి కాపూరు పుష్కరరావు పాల్గొన్నారు.

రంగనాథ్ మృతి బాధాకరం



పరామర్శిస్తున్న నేతలు

పెనుమంట్ర : మండలంలోని మార్టేరు మానవత సంస్థ సభ్యులు, ప్రముఖ వస్త్ర వ్యాపార పులపర్తి బాబ్జీ పెద్ద కుమారుడు రంగనాథ్ చిన్న వయస్సులో మృతిచెందడం బాధాకరమని పలువురు మానవత సంస్థ ప్రతినిధులు వాపోయారు. గురువారం మానవత సభ్యులు వారి ఇంటికి వెళ్లి రంగనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉత్తరాంధ్ర సహకార కమిటీ చైర్మన్ చిర్ల శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పులపర్తి శ్రీరంగనాథ్ మంచి స్నేహశీలి, దాన హృదయులన్నారు. జిల్లా కమిటీ కార్య వర్గ సభ్యులు మార్ని అమ్మిరాజు, మానవత సంస్థ ఉపాధ్యక్షులు, మండల చైర్మన్ కడలి సుబ్రహ్మణ్యం, రీజనల్ చైర్మన్ బాలాల శ్రీనివాసరావు, పూర్వపు అధ్యక్షులు కర్రి కృష్ణారెడ్డి, పడాల జగన్నాథరెడ్డి నివాళులర్పించారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

పాలకొల్లు రూరల్: గ్రామాల్లో రైతులకు అండగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని పాలకొల్లు ఎఎంసి చైర్మన్ కోడి విజయభాస్కర్ అన్నారు. పాలకొల్లు మండలం దిగమర్రు గ్రామంలో పలు పథకాలకు సంబంధించిన 50 శాతం సబ్సిడీపై 55 జతల పశు పూల దాణా పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వంలో రైతులను గాలికి వదిలేసి ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా అధిక ప్రాధాన్యతనిస్తుందని విజయభాస్కర్ తెలిపారు.

రోడ్డు ఆక్రమణలు

పట్టించుకోని ఆర్‌అండ్‌బి అధికారులు

ప్రయాణికుల గగ్గోలు



పెనుమంట్రలో..



పాలకొల్లు రూరల్‌లో..

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని వెలగలేరు వద్ద ఆర్‌అండ్‌బి రహదారి పక్కన పలువురు వ్యక్తులు రోడ్డును ఆక్రమించుకుంటున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. నిత్యం వివిధ వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే మార్టేరు-పెంటపాడు స్టేట్ హైవే రహదారి వెంబడి ఆక్రమణలకు గురై రోడ్డు చిక్కిపోయి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతంలోని రోడ్డు మార్జిన్ వెంబడి వివిధ వ్యాపార కేంద్రాలు పంట బోదెను సైతం పూడ్చేసి దర్జాగా ఆక్రమించుకున్నారని వారు పేర్కొన్నారు. దీంతో రోడ్డు పక్కన వాహనాలు నిలిపేందుకు జాగా లేకపోవడం, ఎదురెదురు వాహనాలు వచ్చినప్పుడు ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని అన్నారు. గతంలో ఇక్కడ పలు ప్రమాదాలు జరిగినందున స్థానిక గ్రామపంచాయతీ, మండలంలోని రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి ఇక్కడ ఉన్న ఆక్రమణలు వెంటనే తొలగించి, వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

పాలకొల్లు రూరల్ : పాలకొల్లు నుండి నరసాపురం వెళ్లే జాతీయ రహదారికి ఇరువైపులా చిరు వ్యాపారాల జోరు కొనసాగుతోంది. పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర నుండి మొదలుకొని నాటు కోళ్ల వ్యాపారం, పళ్లు, మొక్కలు, కూరగాయలు, తేగలు, జున్ను, చెరుకు రసాలు, పిల్లలు ఆడుకునే బొమ్మలు, చీపుర్లు, మాంసం దుఖానాలు ఇలా మొదలైనవన్నీ బాటసారులు, వాహనదారులకు అందరికీ అందుబాటు ధరల్లో ఉండడంతో అటు వ్యాపారుదారులకు, ఇటు కొనుగోలుదారులకు మంచి అవకాశంగా ఉంది. వాహనదారులు బండ్లను ఆపి కొనుగోలు చేస్తున్న సందర్భంలో ట్రాఫిక్‌కు అంతరాయంతో పాటు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ దుకాణాలన్నీ మార్జిన్లలో పెట్టి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగజేస్తున్నారు. అసలే వర్షాల వల్ల రోడ్లు పాడై గోతులమయంగా మారింది. రోడ్ల పక్కన వ్యాపారస్తుల వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తే ప్రమాదం జరిగిన సంఘటనలూ ఎక్కువవుతున్నాయి. వాహనాలు గోతులలో పడి అదుపుతప్పి ప్రమాదాలకు గురై మృత్యువాత పడ్డవారు కూడా ఉన్నారు. అధికారులు వెంటనే స్పందించి వ్యాపారులకు వేరొక చోట స్థలాన్ని కేటాయించి, అమ్మకాలు జరుపుకునే విధంగా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకలు



మొగల్తూరు: బహుమతులు అందజేస్తున్న ఎంఇఒ

ప్రజాశక్తి - మొగల్తూరు

విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ యు.శామ్యూల్‌జాన్ సూచించారు. మొగల్తూరు పంచాయతీ కుక్కలవారి తోటలో ఉన్న భవిత కేంద్రాల్లో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయించాలన్నారు. వికలాంగులని చిన్న చూపు చూడకుండా వారిలో ఉన్న ప్రతిభను గుర్తించి, ఉన్నత స్థాయికి చేర్చే విధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విభిన్న ప్రతిభావంతులలో ఉన్నత స్థాయికి వెళ్లిన వారు కూడా చాలామంది ఉన్నారని, వారిలో తమ చిన్నారులు కూడా ఉండేలా తీర్చిదిద్దాలని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.జానకీ, ఫిజియోథెరపీ వైద్యులు జి.ఆమోసు, ఐఇఆర్‌పి వెలిగట్ల త్రినాథ శ్రీనివాసరావు, మోకా శ్రీనివాస్ ఉన్నారు.

ఆచంట : మానసిక, శారీరక వికలాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, ప్రభుత్వం వీరి కోసం ఎన్నో సదుపాయాలు కల్పిస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ-1 సిహెచ్.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని స్థానిక ఎంపిపిఎస్ బాయ్స్ స్కూల్ ఆవరణలో భవిత కేంద్రంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంఇఒ-1 సిహెచ్.శ్రీనివాసరావు, ఎంఇఒ-2 రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వికలాంగులను ప్రత్యేకంగా చూడవద్దని, మనలో ఒకరిగా భావించి వారిలో మనోధైర్యాన్ని కలిగించినట్లయితే అన్ని రంగాల్లో రాణిస్తారని తెలిపారు. అనంతర పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిఎస్ బాయ్స్ స్కూల్ హెచ్‌ఎం సిహెచ్.బాలయ్య, స్కూల్ మేనేజ్మెంట్ ఛైర్మన్ జి.సూరిబాబు, ప్రత్యేక ఉపాధ్యాయులు కె.దానేశ్వరావు, కె.నాగమణి, ఫిజియోథెరపిస్టు కె.అశోక్ కుమార్, ఐఇఆర్‌పి ఎస్‌ఎంపి గణేష్, ఎంఆర్‌సి స్టాఫ్ వై.గణపతి, బి.భరత్‌కుమార్ పాల్గొన్నారు.

పెనుమంట్ర : సమాజంలో భాగమైన వికలాంగుల పట్ల ప్రతిఒక్కరూ బాధ్యతగా ఉండి, వారిని ఆదరణతో చూడాలని ఎంఇఒ-2 ఉంగరాల నాగేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని పలుచోట్ల అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక భవిత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఇఒ ఉంగరాల నాగేశ్వరరావు మాట్లాడుతూ వికలాంగులను ప్రత్యేకంగా చూడవద్దని, వారిని మనలో ఒకరిగా భావించి, వారిలో మనోధైర్యాన్ని కలిగించినట్లయితే అన్ని రంగాల్లో వారు రాణిస్తారన్నారు. జెడ్‌పి స్కూల్ హెచ్‌ఎం జె.రామలక్ష్మణరావు, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు టి.లోకనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

నరసాపురం : పట్టణంలోని శ్రీహరిపేటలోని భవిత స్కూల్‌లో గురువారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు పి.పుష్పరాజ్యం, జాన్ ప్రభాకర్ మాట్లాడుతూ వికలాంగులైన ఈ చిన్నారులను చాలా జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరముందన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, తెలుగుమహిళ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ యునైటెడ్ కాపు వనితాక్లబ్ ఉపాధ్యక్షురాలు పుప్పాల ఉషాకమల సాజన్యంతో వికలాంగులకు బహుమతులు అందచేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. యునైటెడ్ కాపు వనితాక్లబ్ అధ్యక్షురాలు బండి స్వర్ణలత, కార్యదర్శి రంగినీడి భరణి, కోశాధికారి సలాది మణికర్ణిక, ఆర్యవ్ వాణి, లక్ష్మి, కౌన్సిలర్ భవాని, మాజీ కౌన్సిలర్ చిన్నాయమ్మ పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులోని కుక్కలవారి తోటలో ఉన్న భవిత కేంద్రంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం లయన్స్ క్లబ్ మొగల్తూరు శాఖ ఆధ్వర్యాన గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ క్లబ్ మొగల్తూరు శాఖ కార్యదర్శి గుమ్మళ్ల రవిబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు భోజన ఏర్పాట్లు చేశారు. ఎంఇఒ యు.శామ్యూల్ జాన్, క్లబ్ అధ్యక్షురాలు యు.గీత షారోన్ పుష్ప, పాస్ట్ ప్రెసిడెంట్ యు.రాంబాబు, పొన్నపల్లి త్రినాథ్ వడయార్ క్లబ్ సభ్యులు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

రెడ్‌క్రాస్ సంస్థ సేవలు అభినందనీయం

జెసి రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - నరసాపురం

పకృతి వైపరీత్యాల సందర్భంలో నష్టపోయిన ప్రజలను ఆదుకోవడానికి ముందుకు వచ్చిన రెడ్‌క్రాస్ సంస్థ అభినందనీయమని జెసి రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. జిల్లాలో మొంథా తుపాను కారణంగా నష్టం జరిగిన 93 మంది కుటుంబాలకు గురువారం నరసాపురం ఆర్‌డిఒ కార్యాలయంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన సహాయక సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో మానవతా సేవలో ముందంజలో ఉండేది రెడ్ క్రాస్ సంస్థ అన్నారు. రెడ్ క్రాస్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు అనేకం ప్రజల నుండి అభినందనలు అందుకుంటుందన్నారు. రెడ్ క్రాస్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ భద్రిరాజు, రాష్ట్ర రెడ్‌క్రాస్ ఛైర్మన్ వైడి.రామారావు, రాష్ట్ర ట్రెజరర్ డి.శ్రీహరి రావు, ఆర్‌డిఒ దాసిరాజు, తహశీల్దార్‌లు అయితం సత్యనారాయణ, రాజ్ కిషోర్, రెడ్ క్రాస్ వైస్ ఛైర్మన్ వి.కనకరాజు, కె.తిరుపతి రాజు, సిహెచ్.ఫణి కుమార్, గోపిశెట్టి కృష్ణారావు పాల్గొన్నారు.

కేన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

మొదటి దశలోనే గుర్తిస్తే ప్రాణాలు కాపాడవచ్చు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - తణుకు

కేన్సర్ వ్యాధి వ్యాప్తిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఎప్పటికప్పుడు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుంటూ వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. తణుకు స్వర్ణ లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన చిట్టూరి సుజాత ఆర్థిక సాయంతో గురువారం హైదరాబాద్‌కు చెందిన బసవతారం ఇండో అమెరికన్ ఇన్సిట్యూట్ సహకారంతో చేపట్టిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేన్సర్ ప్రాణాంతకమైన, భయంకరమైన వ్యాధి అని, ప్రపంచవ్యాప్తంగా మహమ్మారిలా వ్యాప్తి చెందుతూ అనేక మంది ప్రాణాలు తీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో తొలి దశలోనే స్క్రీనింగ్ పరీక్షల ద్వారా వ్యాధిని గుర్తించడం ద్వారా ప్రాణనష్టాన్ని నివారించవచ్చని అన్నారు. ముఖ్యంగా ఆహారపు అలవాట్లు, జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకోవడం ద్వారా కేన్సర్ రాకుండా నివారించవచ్చన్నారు. కేన్సర్ లక్షణాలు ఉన్నప్పటికీ, లేకపోయినప్పటికీ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా కేన్సర్‌ను జయించవచ్చని చెప్పారు. కార్యక్రమలో ఎఎంసి ఛైర్మన్ కొండేటి శివ, జోన్ ఛైర్‌పర్సన్ కెఎన్.పద్మావతి, క్లబ్ అధ్యక్షులు బూరుగుపల్లి వెంకట్రావు, కార్యదర్శి సుంకవల్లి సూర్యకుమారి, కోశాధికారి గొరస దుర్గామహేష్, కూటమి నాయకులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

డిఎల్‌డిఒ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - నరసాపురం


మండలంలోని సీతారామపురం సౌత్ గ్రామంలో గురువారం డివిజనల్ డెవలప్మెంట్ అధికారి భవనాన్ని మాజీ ఎంఎల్ఎ కొత్తపల్లి జానకీరామ్‌తో కలిసి టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు ప్రారంభించారు. సుమారు రూ.13 లక్షలతో సచివాలయ ఆవరణలో భవనాన్ని ఆధునీకరించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పాలన అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం డివిజన్ అధికారి కార్యాలయాన్ని నిర్మించిందన్నారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పాలన, ప్రజలకు అందుతున్న సేవలు తెలుసుకునే విధంగా ఒక అధికారి నియమించడంతో పాటు వారికి మెరుగైన సదుపాయాలు కల్పించాలన్న ఉద్దేశంతో భవనాన్ని ఆధునీకరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఒలు జి.రాణి, జ్యోతిర్మయి, ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, సర్పంచి దొండపాటి వెంకట్, ఎంపిడిఒ నాసర్ రెడ్డి, కూనపరెడ్డి ఏసు, దొంగ శ్రీరామచంద్రుడు, ఆకన సుబ్రమణ్యం పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రామరాజు, జానకీ రామ్

తూకాల్లో మోసాలు అరికట్టాలి

ఎపి కౌలురైతుల సంఘం డిమాండ్



రైతులతో మాట్లాడుతున్న రామాంజనేయులు

ప్రజాశక్తి - పెనుగొండ

ధాన్యం కొనుగోలులో తూకాల్లో మోసాలు, తరుగు, తేమశాతం పేరుతో మోసపోతున్న కౌలురైతులను మిల్లర్లు, బ్రోకర్ల దోపిడీ నుండి రక్షించేందుకు మండల, రైతుసేవా కేంద్రం అధికారులు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ విధానాలు ప్రచారం చేసి, రైతులకు భరోసా కల్పించాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలులో సమస్యలు తెలుసుకునేందుకు పెనుగొండ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించామన్నారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ధాన్యం తూకాల్లో మోసాలపై జిల్లా ఉన్నత అధికారులు, మండల వ్యవసాయాధికారులు ఎన్ని ప్రకటనలిచ్చినా ఆచరణలో ఎక్కడా మార్పు రాలేదని విమర్శించారు. పెనుగొండలోని పిల్లల పుంత ప్రాంతంలో చెల్లింకల వెంకన్న అనే కౌలురైతు మాట్లాడుతూ 15 ఎకరాల వరకు కౌలుభూమి సాగు చేస్తున్నానని, ఇటీవల ధాన్యం పడితే 41 కేజీల 100 గ్రాములు చొప్పున తూచారన్నారు. అయినా మిల్లుకి వెళ్లాక తరుగు పేరుతో మరో 80 కేజీల ధాన్యం తీసుకున్నారని, గురువారం మళ్లీ ధాన్యం అమ్మితే రైతుసేవ కేంద్రంలో తేమశాతం 18 వస్తే మిల్లు వద్ద 20 పాయింట్లు చూపించి 5 సారల ధాన్యం తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను సంబంధిత మండల ఎఒ పి.స్పందన దృష్టికి తీసుకెళ్లగా ఎఒ మాట్లాడుతూ రైతులను మిల్లర్లు, కానీ మధ్యవర్తులు గానీ మోసం చేస్తే వెంటనే మమ్మల్ని సంప్రదించాలని, రైతుకు నష్టం కలగకుండా మాట్లాడి చర్యలు తీసుకుంటామని కౌలురైతులకు హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కౌలురైతులు పూతినీడి సోమేశ్వరావు, పిల్లి రామకృష్ణ, కుడిపూడి సత్యనారాయణ, పూతినీడి ధర్మరాజు, మాకా సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘంటసాలను ఆదర్శంగా తీసుకోవాలి

103వ జయంతి వేడుకల్లో పలువురు వక్తలు




ఘంటసాల విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం

అమర గాయకులు, అజరామర సంగీత కర్త లలిత సంగీత వైతాళికులు, భారత స్వాతంత్ర సమరయోధులు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావును నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. జువ్వలపాలెం రోడ్డులో కాటన్ పార్కు వద్ద ఘంటసాల కాంస్య విగ్రహం వద్ద 103వ జయంతి వేడుకలు అత్యంత ఘనంగా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గంటసాల విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పద్మశ్రీ ఘంటసాల అమర గాయకులని, గాన గంధర్వుడని నవరసాలను ఆయన తన స్వరంతో పలికించారన్నారు. ఆయన తెలుగు వాడిగా జన్మించటం మన అదృష్టమన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని స్ఫూర్తి పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల కాంస్య విగ్రహ కమిటీ ఉపాధ్యక్షులు వేగేశ్న రంగరాజు, కాస్మోపాలిటన్ అధ్యక్షులు అల్లూరి పద్మరాజు, ఉపాధ్యక్షులు డాక్టర్ ముదునూరి గోపాలకృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శి వల్లూరు వెంకట రాధాకృష్ణమూర్తి, కంతేటి వెంకట్రాజు, పెన్మెత్స శ్రీనివాసరాజు, రేపాక వెంకన్న బాబు, సిహెచ్.ప్రసాదరావు పాల్గొన్నారు.

పిటిఎంకు పాఠశాల ముస్తాబు



ఉత్తరపాలెం ఎంపిపి స్కూల్

ప్రజాశక్తి - ఉండి

మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌కు మండలంలోని మహదేవపట్నం శివారు ఉత్తర పాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ముస్తాబైనట్లు హెచ్‌ఎం పిఎస్ఎన్.రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో కెనరా బ్యాంక్ సహకారంతో నూతనంగా భోజనశాల నిర్మించినట్లు తెలిపారు . తమ పాఠశాలకు సుమారు 27 సంవత్సరాల క్రితం రంగులు వేశారని, నేడు తన సొంత ఖర్చులతో పాఠశాలకు రంగులు వేయించడం జరిగిందన్నారు. జనవరి ఒకటో తేదీ నాటికి పాఠశాలలో సరస్వతి విగ్రహం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన వివరించారు. దాతలు ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సహకారం అందించాలని ఆయన కోరారు.

యండగండిలో ఆక్రమణల తొలగింపు

ఉండి: ఆక్రమణదారులు ప్రభుత్వానికి స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించేందుకు సహకరించాలని యండగండి గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి నాగేశ్వరరావు, గ్రామ రెవెన్యూ అధికారులు శ్రీనివాస్, గణపతిరావు తెలిపారు. గురువారం గ్రామంలోని ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. యండగండి-ఎస్.కొండేపాడు రహదారిలో సుమారు 21 ఇళ్లకు చెందినవారు రహదారి ఆక్రమించి ఇల్లు నిర్మించారని ఉన్నతాధికారుల సూచనల మేరకు వారిలో అర్హులైన ముగ్గురికి వేరేచోట ఇంటి పట్టాలు ఇవ్వడం జరిగిందని, మిగిలిన 18 మందికి వేరేచోట సొంత ఇల్లు ఉన్నాయన్నారు. అదేవిధంగా శివాలయం వీధిలో రహదారి ఆక్రమించి ఇల్లు నిర్మించారని ఇటీవల ఉన్నతాధికారులకు పేరిచర్ల సత్యనారాయణ రాజు అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో రహదారి కొలతలు పారదర్శకంగా కొలవడం జరిగిందని, ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తొలగించాలని ఆయన సూచించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - నరసాపురం

బాల్య వివాహ్ ముక్తి భారత్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా దర్భరేవు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల్లో గురువారం నిర్వహించారు. బాల్యవివాహాలు అనర్థాలను తెచ్చిపెడతాయని, బాల్యవివాహాలు చేసుకోరాదని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సిహెచ్.దుర్గా భవాని సూచించారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ బి.నెహెమియ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు వివరించారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వివిఎన్‌వి.లక్ష్మి పాల్గొన్నారు.

గణపవరం : ఐసిడిఎస్ గణపవరం సెక్టార్ ఆధ్వర్యాన గురువారం స్థానిక బాలికల హైస్కూల్లో బాల్యవివాహ ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సెక్టార్ సూపర్‌వైజర్ బి.విజయలక్ష్మి మాట్లాడుతూ వందరోజుల ప్రోగ్రాం సందర్భంగా దేశంలో బాల్యవివాహరహిత దేశంగా మార్చడానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎన్ కళాశాలలో భారత నౌకాదళ దినోత్సవం

ప్రజాశక్తి - నరసాపురం

శ్రీవైఎన్ కళాశాలలో ఎన్‌సిసి నేవల్ యూనిట్, భారత నౌకాదళ దినోత్సవాన్ని దేశభక్తి భావంతో నిర్వహించారు. కార్యక్రమంలో 1971లో జరిగిన చారిత్రక 'ఆపరేషన్ ట్రైడెంట్'ను స్మరించుకుంటూ భారత నౌకాదళ వీరోచిత సేవలు, విజయాలను ప్రతిబింబించారు. సెవెన్ ఆంధ్ర నావెల్ యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కమేండర్ చిట్టి రోహిత్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై క్యాడెట్లను ఉద్దేశించి మాట్లాడారు. భారత సముద్ర సరిహద్దులను కాపాడడంలో నౌకాదళం కీలక పాత్రను వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణను పెంపొందించుకొని రక్షణ దళాల్లో ప్రవేశించడంపై ఆలోచించాలని ఆయన సూచించారు. ఎన్‌సిసి క్యాడెట్లకు నేవీ డే సందర్భంగా సర్టిఫికెట్స్, మెడల్స్ కాలేజీ యాజమాన్యం అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.కనకారావు, గవర్నింగ్ బాడీ మెంబర్ ఆర్‌వి.సుబ్బారావు, హెచ్‌ఆర్‌టి సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సి.శ్రీనివాస్, డీన్ గంధం శ్రీనివాస్, సబ్ లెఫ్టనెంట్ జి.సునీత, సెవెన్ ఆంధ్ర నావెల్ యూనిట్ సిఐ ధర్మరాజు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

విద్యార్థికి సైకిల్ అందజేత

ప్రజాశక్తి - భీమవరం టౌన్

దాతలందిస్తున్న సహాయ సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బొండా రాంబాబు, అల్లు తులసీప్రసాద్ అన్నారు. గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన స్థానిక ఎఆర్‌కెఆర్ హైస్కూల్‌లో ప్రతిభ కలిగిన పేద విద్యార్థికి సైకిల్‌ను అందించారు. వారు మాట్లాడుతూ భీమవరం నర్సయ్య అగ్రహంకు చెందిన 9వ తరగతి పేద విద్యార్థిని జొన్నాడ ఎలీషాకు సైకిల్‌ను అందించడం జరిగిందని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నతస్థాయికి చేరుకోవాలని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి కనగర్ల రామకృష్ణ, గోపిశెట్టి మురళీకృష్ణ, పావిరాల రామ్ మోహన్‌రావు, సరోజిని, పులవర్తి రామకృష్ణ, భట్టిప్రోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణకు అపూర్వ స్పందన

ప్రజాశక్తి - పెనుగొండ

కోటి సంతకాలతో వైసిపి అధ్యక్షుడు వైఎస్.జగన్మోహన్ రెడ్డి పిలుపునకు అపూర్వ స్పందన వస్తుందని మాజీ మంత్రి, ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గురువారం పెనుగొండ గాంధీ బొమ్మ సెంటర్లో కోటి సంతకాల కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రయివేటుకు దారాదత్తం చేస్తున్న ప్రభుత్వ తీరును నిరసించాలన్నారు. కార్యక్రమంలో వైసిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కక్షిదారులకు రాజీ ప్రాముఖ్యత వివరించాలి

జిల్లా జడ్జి డాక్టర్ బి.లక్ష్మీ నారాయణ

భీమవరం టౌన్: ఈనెల 13వ తేదీన జరగబోతున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ క్రిమినల్ కేసుల రాజీకి తీసుకున్న చర్యల గురించి చర్చించుటకు గురువారం 3వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ ఛైర్మన్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి, గౌరవ డాక్టర్ బి.లక్ష్మీ నారాయణ అధ్యక్షతన పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కక్షిదారులకు రాజీ ప్రాముఖ్యత వివరించి స్వచ్ఛందంగా కేసులు రాజీ చేసుకునేలా ప్రయత్నం చేయమన్నారు. ఈ సమావేశంలో సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎం.సుధారాణి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి.సురేష్ బాబు, 1వ అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) పి.హనీష పాల్గొన్నారు.